'నూతన' సందడి

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శనివారం నల్లగొండ పట్టణంలో బేకరీ దుకాణాల వద్ద సందడి నెలకొంది. యువత సంబురాల్లో మునిగిపోయారు. కేక్ కట్ చేసి న్యూ ఇయర్‌కు స్వాగతం పలికారు. – రామగిరి (నల్లగొండ)



నల్లగొండ పట్టణంలో బేకరీ దుకాణం వద్ద నెలకొన్న రద్దీ



నల్లగొండలోని ఓ కళాశాలలో కేరింతలు కొడుతున్న విద్యార్థినులు

ఆరోగ్య నియమాలు పాటించాలి

● జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి

నల్లగొండ : విద్యార్థులు ఆరోగ్య నియమాలను పాటించాలని డీఈఓ భిక్షపతి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని కతాల్‌గూడ ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో విద్యార్థులకు ప్రముఖ ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ వినోద్ కుమార్, దంత వైద్య నిపుణులు డాక్టర్ ఓరుగంటి శ్రీనివాస్‌లు, కంటి వైద్య నిపుణులు డాక్టర్ పుల్లారావులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నూతన సంవత్సర సందర్భంగా కేక్ కట్ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తరాల పరమేశ్ యాదవ్



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ అధ్యక్షుడు లయన్ చిలుకూరి రామకృష్ణ, జోన్ చైర్ పర్సన్ లయన్ గట్టుపల్లి అశోక్ రెడ్డి, కోశాధికారి యారమాద అశోక్, లయన్ కోటేశ్వరరావు, లయన్ పున్న చండీకేశ్వర్, లయన్ గుండెబోయిన జానయ్య, లయన్ సత్యనారాయణ, లయన్ గట్టుపల్లి రవీందర్ రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ ఊబిది యాదయ్య, కౌన్సిలర్ కంకణాల లక్ష్మమ్మ పాల్గొన్నారు.

మన ఊరు – మన బడి పనుల పరిశీలన

మన ఊరు – మన బడి కింద ప్రతిమండలానికి మోడల్ స్కూల్స్‌గా ఎంపిక చేసిన రెండు పాఠశాలల్లో జనవరి 7వ తేదీ లోగా పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని డీఈఓ భిక్షపతి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని కతాల్‌గూడ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనుల ప్రగతిని ఆయన పరిశీలించి మాట్లాడారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

రామగిరి(నల్లగొండ) : స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) నల్లగొండ జిల్లా డైరీ, నూతన క్యాలెండర్‌ను డీఈఓ భిక్షపతి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గణపురం భీమయ్య, కొనకంచి వీరరాఘవులు, నరేంద్రరెడ్డి, విజయప్రసాద్, ఎండీ జాన్‌ఖాన్, చంద్రకళ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఎంజీయూ (నల్లగొండ రూరల్): మహాత్మాగాంధీ యూనివర్సిటీ 2023 క్యాలెండర్‌ను శనివారం వీసీ గోపాల్ రెడ్డి ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ కృష్ణారావు, రవి, అంజిరెడ్డి, శ్రీదేవి, రేఖ, అన్నపూర్ణ, అరుణప్రియ, ప్రేమ్‌సాగర్, హరీష్, కళ్యాణి తదితరులు ఉన్నారు.

రాపోలుకు మిద్దతోట పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రాపోలు దంపతులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని బృందావనం కాలనీకి చెందిన రాపోలు వెంకటేశ్వర్లు, రమణమ్మ దంపతులకు మిద్దె తోట పురస్కారం లభించింది. వీరు సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పండ్లు పూల పెంపకంతో మంచి ఫలితాలు సాధిస్తుండడంతో శనివారం హైదరాబాద్‌లో తుమ్మేటి రఘోత్తమరెడ్డి రైతు నేస్తం ఫౌండేషన్ మిద్దె తోట పురస్కారాల ప్రదానోత్సవం సందర్భంగా ఫౌండేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల ఈ పురస్కారాన్ని అందజేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం

● నల్లగొండ మున్సిపల్ కమిషనర్ రమణాచారి

నల్లగొండ : నల్లగొండ పట్టణంలో రోడ్డు వెడల్పునకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరిస్తున్నందునే అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ రమణాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంవత్సర కాలంలో పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులకు నల్లగొండ ఎమ్మెల్యే, కౌన్సిలర్లు ఎంతో సహకరించారని పేర్కొన్నారు. మిగిలిన పనులను నూతన సంవత్సరంలో మొదటి 6 మాసాల్లో పూర్తి చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కమిషనర్‌కు సన్మానం



మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు

నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీలో విద్యుత్ పొదుపు చేసి ఏడాదికి రూ.18 లక్షలు ఆదా చేసినందుకు మున్సిపల్ కమిషనర్ రమణాచారిని ప్రభుత్వం గోల్డెన్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈసందర్భంగా శనివారం మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు సత్యనారాయణ, రాధిక, జమాల్‌ఖాద్రీ ఆయనను సన్మానించారు.

మెరుగైన వైద్యం అందించేందుకు కృషి

కేతేపల్లి : అనారోగ్యం బారిన పడిన నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. కేతేపల్లి మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ఇట్టమళ్ల నరేష్‌కు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు, ఉప్పలపహాడ్ గ్రామానికి చెందిన ఏర్పుల నాగరాజుకు మంజూరైన ఎల్‌ఓసీ చెక్కులను శనివారం నకిరేకల్‌లోని క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, కొత్తపేట సర్పంచ్ బచ్చు జానకిరాములు, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా కేతేపల్లి మండల పీఆర్టీయూ 2023 సంవత్సరం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, డేవిడ్, వెంకటయ్య, గణేష్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చీకటిగూడెం గ్రామానికి చెందిన ముత్తినేని చిన సైదయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సందర్శించి నివాళులర్పించారు. కొత్తపేట గ్రామంలో ఆత్మహత్యకు పాల్పడిన పట్టేటి కిరణ్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు.

తెలంగాణ సంస్కృతికి నిదర్శనం 'గంగెద్దు'

● సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్



గంగెద్దు కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న జూలూరి

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు శీలం భద్రయ్య రాసిన గంగెద్దు కథా సంపుటి తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న బుక్ ఫెయిర్‌లో జూలూరి గౌరీశంకర్ ఈ కథా సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ప్రజల జీవితాన్ని అనేక కోణాల్లో చూపించిన గంగెద్దు వంటి కథా సంపుటిలు ఇంకా రావాల్సిన అవసరం ఉందన్నారు. 'లొట్టపీసుపూలు' కథలతో తెలుగు సాహిత్యంలో అడుగు పెట్టిన శీలం భద్రయ్య గంగెద్దు కథా సంపుటిని ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ ఎస్. రఘు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ చరిత్ర పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాసులు, తంగేడు పత్రిక సహ సంపాదకుడు కాంచనపల్లి గోవర్ధనరాజు, తెలంగాణ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ పాలడుగు సరోజినీదేవి, పరిశోధకుడు వెల్దండి శ్రీధర్, సాహితీవేత్తలు వేముల యల్లయ్య, జయప్రకాష్, రామ్‌చందర్‌జీ, నేదునూరు రవీందర్‌రెడ్డి, గుండగాని రాజయ్య, సాగర్ల సత్తయ్య, వరప్రసాద్, ఉష పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

చిట్యాల: బంధువుల అంత్యక్రియల్లో పాల్గొని వెళ్తున్న వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. చౌటుప్పల్ మండల రెడ్డిబావి గ్రామానికి చెందిన నందగిరి ఇస్తారి(70) చిట్యాల మండలం వెంబావి గ్రామంలో తమ బంధువులు మృతిచెందితే అంత్యక్రియల్లో పాల్గొనేందుకు టీవీఎస్ ఎక్సెల్‌పై వచ్చాడు. అంత్యక్రియల అనంతరం తిరిగి తన స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో వెలిమినేడు గ్రామ శివారులో పిట్టంపల్లి గ్రామానికి వెళ్లే దారి వద్దకు రాగానే ఎక్సెల్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇస్తారి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీస్ ఈవెంట్స్‌లో 577మంది ఎంపిక

నల్లగొండ క్రైం: పోలీసు ఉద్యోగాల భర్తీలో భాగంగా నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఈవెంట్స్‌లో శనివారం 577మంది ఎంపికయ్యారు. 1374మంది అభ్యర్థులకు 1193మంది హాజరైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఈవెంట్స్‌ను స్పెషల్ ఎస్పీ శబరీష్ పర్యవేక్షించారు.



















